ప్రజా బడ్జెట్‌కు ఎగనామం

- ఓటాన్ అకౌంట్ పేరుతో సంక్షేమానికి మొండిచేయి
- తాత్కాలిక బడ్జెట్‌కే ప్రభుత్వం ఆమోదం
- నియోజకవర్గంలో హామీలు, అభివృద్ధి బుట్టదాఖలు
- సమస్యలతో ప్రజలకు సహవాసం తప్పని పరిస్థితి

కర్నూలు (టౌన్): ఎన్నికల్లో ప్రజలను ఎలాగైనా బురిడీ కొట్టించి అధికారంలోకి రావాలని నిర్ణయించుకున్న కూటమి ప్రభుత్వం అలవికాని హామీలతో సూపర్‌సిక్స్ అమలు చేస్తామంది. ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేసింది. ఇంట్లో ఎంత మంది చదువుకునే పిల్లలుంటే అందరికీ అమ్మకు వందనం అంది. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.1500 అమలు చేస్తామని చెప్పింది. నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామంది. బీసీ కులాలకు 50 సంవత్సరాలకే పెన్షన్ అంటూ ప్రకటించింది. ఇలా.. గత ప్రభుత్వం కన్నా రెండింతలు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ప్రజలకు చెప్పి అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు నెలన్నర రోజులు కావడంతో ప్రజలకు ఇచ్చిన హామీలు నేరవేర్చడంలో తర్జన భర్జన పడుతోంది. మెలిక పెడుతోంది. కోతలు విధిస్తోంది. తాజాగా పూర్తిస్థాయిలో బడ్జెట్ అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోంది. ప్రజా సంక్షేమాన్ని నీరు కార్చేందుకు, హామీలు అమలుచేయకుండా కాలయాపన చేసేందుకు కుట్రలకు తెరలేపింది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పేరుతో సంక్షేమాన్ని పక్కన పెట్టే ప్రయత్నాలు చేస్తోంది. నెలన్నర రోజుల పాలనలోనే ప్రజల ఆశలపై నీళ్లు చల్లింది.

నియోజకవర్గ అభివృద్ధి, హామీల అమలు సాధ్యమా..?

ప్రభుత్వ ఖర్చులకే పరిమితం చేస్తూ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు కూటమి ప్రభుత్వం మొగ్గు చూపడంతో సూపర్ సిక్స్ హామీలను గాలికొదిలేసింది. ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, ఆయన తనయుడు నారా లోకేశ్, కూటమి పార్టీల నాయకులు కర్నూలు నియోజకవర్గానికి ఎన్నో హామీలు గుప్పించారు. నియోజకవర్గంలో మంచినీటి సమస్య ఉందని, తాము అధికారంలోకి వస్తే అదనంగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు రూ.130 కోట్లు. నగరంలో దీర్ఘకాలికంగా ఉన్న సుద్దవాగు వంక సమస్యను పరిష్కరిస్తామని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులు చేస్తామని బాహాటంగా ప్రకటించారు. దీనికి రూ.700 కోట్లు పైగా ఖర్చవుతుంది. రూ.130 కోట్లతో మురుగు నీటి శుద్ధి కేంద్రాలు, అదనంగా ఓవర్‌హెడ్ ట్యాంకులు ఇలా.. అనేక హామీలు అమలు కావడం సాధ్యం కాదన్న అభిప్రాయాన్ని పలువురు మేధావులు వ్యక్తం చేస్తున్నారు. అలాగే కర్నూలు నగరంలో ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ స్కూళ్లు 433 ఉన్నాయి. గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ ఫలాల వల్ల విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. డ్రాపవుట్స్ తగ్గాయి. అమ్మ ఒడి పథకం కింద 46 వేల మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి ఏటా రూ.15 వేల చొప్పున ఐదేళ్ల పాటు అందజేసింది. ఇక ప్రస్తుత ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో అమ్మకు వందనం పథకాన్ని ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలున్నా అందరికీ వర్తింపజేస్తామని ప్రకటించింది. విద్యాశాఖ లెక్కల ప్రకారం 75 వేల మంది విద్యార్థులకు అమ్మకు వందనం పథకానికి అర్హత ఉంది. వీరందరికీ రూ.15 వేల ప్రకారం ఏటా 1,125 కోట్లు మంజూరు చేయాల్సి ఉంది. ఒక్క పథకానికే ఏడాదికి రూ. వెయ్యి కోట్లకు పైగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇది సాధ్యమా?.. అన్న అనుమానాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా 50 రోజులు దాటినా రైతులకు పెట్టుబడి సాయం అందించకపోవడం, బడులు ప్రారంభమై 40 రోజులు కావడంతో విద్యాసంస్థలు ఫీజుల కోసం తల్లిదండ్రులను ఒత్తిడి చేస్తున్నా అమ్మకు వందనం పథకాన్ని అమలుచేయకపోవడంతో కూటమి ప్రభుత్వ పనితీరుపై విమర్శలు వస్తున్నాయి. ఇప్పుడు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పేరుతో సంక్షేమానికి తూట్లు పొడిస్తే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత తప్పదు.



ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు అమోదం..?

తాత్కాలిక బడ్జెట్ లేదా ఓటాన్ అకౌంట్ బడ్జెట్. పేరు ఏదైనా ఇది ఏడాది పాటు అమలయ్యే పూర్తిస్థాయి బడ్జెట్ కాదు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫలమైన ప్రభుత్వం నాలుగు నుంచి ఆరు నెలలకు సరిపడా తాత్కలిక బడ్జెట్ వైపు మొగ్గు చూపింది. చిత్తశుద్ధి లేకపోవడం, నిధులు రాబట్టడంలో ప్రభుత్వ వైఫల్యం, కేంద్రం నుంచి స్పష్టమైన హామీ కనిపించకపోవడం, రికార్డు స్థాయిలో అప్పులు చేయడంతోనే కాలం గడుపుతోంది. దీంతో తాత్కాలిక బడ్జెట్ అమలు చేయనుంది. రాబడి, వ్యయాలను పక్కన పెట్టి కేవలం ప్రభుత్వ ఖర్చుల కోసమే ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అమలు చేసేందుకు ప్రభుత్వం ముందుకు పోతుంది. ఉద్యోగుల జీతాలకే ఈ బడ్జెట్ సరిపోతుంది. భారీ స్థాయిలో ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల పరిస్థితి ఏంటన్న ప్రశ్న ప్రజల్లో మొదలైంది. గత ప్రభుత్వం రెండేళ్లు కరోనా సమయంలోనూ ప్రజలకు ఇచ్చిన సంక్షేమ పథకాలను వంద శాతం అమలు చేసింది. అయితే ఇప్పుడు ఉన్న సర్కార్ ఖజానా లేదంటూ మరో ఏడాది సంక్షేమ పథకాలను వాయిదా వేసే కుట్రకు తెరలేపింది.

పూర్తిస్థాయి బడ్జెట్ అమలుచేయాలి



కూటమి నాయకులు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు తప్పించుకునే విధంగా ప్రభుత్వం నాటకాలాడుతోంది. ప్రజలు పూర్తిస్థాయిలో అధికారం ఇచ్చారు. ప్రజలకు ఇచ్చిన హామీలు పూర్తిగా నెరవేర్చాలి. రాబడి, ఆదాయాలు, ఖర్చులు బేరీజు వేసుకొని ఈ ఏడాది బడ్జెట్ ప్రవేశ పెట్టవచ్చు కదా.. ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదు. ఈ ఏడాది సంక్షేమ పథకాలను పక్కన పెట్టాలని చూస్తోంది. ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదు. విజన్ ఉందని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి ప్రజలకు ఇచ్చిన హామీలన్ని నేరవేర్చాలి. – హనుమంతరెడ్డి, అబ్బాస్ నగర్

నగర అభివృద్ధి పగటికలే !



తాత్కాలిక బడ్జెట్ పేరుతో ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసే ప్రయత్నాలు చేస్తోంది. సంక్షేమాన్ని నీరుగారుస్తోంది. శాసన సభలో ఓటాన్ ఆకౌంట్ బడ్జెట్ అమలు చేయడం ద్వారా కేవలం ప్రభుత్వం ఖర్చులకు మాత్రమే బడ్జెట్ వాడుకోవాల్సి ఉంటుంది. రెండు నెలలు కూడా కాలేదు. అప్పుడే ఆర్థిక ఎమర్జెన్సీ వచ్చిందా. గత ప్రభుత్వం ఐదేళ్ల పాటు రూ.2.65 లక్షల కోట్లు ప్రజా సంక్షేమానికి ఖర్చు చేసింది కదా. ప్రస్తుత ప్రభుత్వం ప్రజలను మోసం చేసే ప్రయత్నాలకు పాల్పడుతోంది. పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి. పన్నులు, విద్యుత్ బిల్లులు, భూముల ధరలను పెంచాలని చూస్తే ప్రజాగ్రహం తప్పదు. – వెంకటేశ్వర్లు, కృష్ణానగర్

క్లుప్తంగా

తెలంగాణ మద్యం పట్టివేత



సెబ్ తనిఖీల్లో పట్టుబడిన అక్రమ మద్యం

కర్నూలు: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తనిఖీల్లో తెలంగాణ మద్యం పట్టుబడింది. కర్నూలు సెబ్ సీఐ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం కల్లూరు మండలం సల్కాపురం గ్రామంలో అనుమానితుల ఇళ్లు తనిఖీ చేశారు. బోయ నవీన్ ఇంట్లో 44 తెలంగాణ మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. విక్రయదారునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

మాజీ సైనికుడి మృతి



పొన్నూరు వెంకటేశ్వర్లు (ఫైల్)

కర్నూలు(అర్బన్): నగరంలోని సప్తగిరినగర్‌లో నివాసం ఉంటున్న మాజీ సైనికుడు పొన్నూరు వెంకటేశ్వర్లు అనారోగ్యంతో ఈ నెల 21వ తేదీన మృతి చెందారని జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు నర్రా పేరయ్య తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మద్రాసు రెజిమెంట్‌లో వెంకటేశ్వర్లు క్లాస్ టు సోల్జర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ చేశారన్నారు. ఆయన మృతి పట్ల సంక్షేమ సంఘం తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తోందన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మాజీ సైనికుల కుటుంబాలకు సంఘం ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు.

'తల్లికి వందనం'పై నిర్ణయం ప్రకటించాలి

కర్నూలు కల్చరల్: తల్లికి వందనం పథకంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకటించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్పీ కృష్ణారెడ్డి, ఎస్.రామకృష్ణ ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 40 రోజులు గడిచినా ఇంత వరకు ప్రభుత్వం పథకం అమలుపై విధి విధానాలు ప్రకటించలేదన్నారు. వెంటనే విద్యార్థుల తల్లిదండ్రులకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యాశాఖ మంత్రి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి అపరిష్కృత సమస్యలపై చర్చించాలని కోరారు.

డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్టులను తీసివేయాలి

కర్నూలు కల్చరల్: డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్టులను తీసివేయాలని రాయలసీమ విశ్వవిద్యాలయం అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం జిల్లా అధ్యక్షుడు డి.వేణుగోపాలచారి డిమాండ్ చేశారు. సోమవారం వర్సిటీలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు మీడియం చదివే విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు పెరిగేలా సహకరించాలన్నారు. అనంతరం వర్సిటీ ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, సీడీసీ డీన్ ఆచార్య సి.వి.కృష్ణారెడ్డిని ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ కార్యదర్శి నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు గుర్రాల వెంకటరెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షులు శౌరీల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బోధనాభ్యసన సామగ్రి మేళా

కర్నూలు కల్చరల్: భారత ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశాల మేరకు బి.తాండ్రపాడు డైట్ కళాశాలలో సోమవారం బోధనాభ్యసన సామగ్రి మేళా ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ పి.వసుంధరాదేవి పేర్కొన్నారు. మేళాను ప్రారంభించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఈనెల 28వ తేదీ వరకు మేళా జరుగుతుందన్నారు. బోధనా సామగ్రితో బోధనలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని, పిల్లల్లో నూతనోత్సాహం నింపవచ్చన్నారు. కళాశాల అధ్యాపకులు జనార్దన్ రెడ్డి, డాక్టర్ ఎస్.షంషుద్దీన్, డాక్టర్ అయూబ్ హుసేన్, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు ఘన సన్మానం

కర్నూలు (టౌన్): నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజకు ఘన సన్మానం లభించింది. గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీపై వెళుతున్న కమిషనర్‌ను సోమవారం రాత్రి స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో ఘనంగా సత్కరించారు. నగర మేయర్ బీవై రామయ్య, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, నగర పాలకకు చెందిన అన్ని విభాగాల అధికారులు, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, జునైద్, మేనేజర్ చిన్నరాముడు, ఈఈలు, డీఈలు, ఏఈలు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. కమిషనర్‌కు శాలువా కప్పి పూలమాలలు, బొకేలతో సన్మానించారు.

రోడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించండి

కర్నూలు కల్చరల్: ఆదోని అసెంబ్లీ పరిధిలో రోడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే డాక్టర్ వాల్మీకి పార్థసారథి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో వినతి పత్రం అందజేశారు. నియోజక వర్గం పరిధిలోని రహదారులు ప్రమాదకరంగా ఉన్నాయని వాటిని మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరారు.

ఆర్‌యూలో వీసీ పరిశీలన



విద్యార్థుల హాజరుశాతాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం కళాశాలల్లో అకాడమిక్ అట్మాస్పియర్ మెరుగుపడాలని వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ సూచించారు. ఆయన సోమవారం అకాడమిక్ బిల్డింగ్-1, 2తో పాటు లైఫ్‌సైన్స్ విభాగాల్లో పీజీ తరగతులు జరుగుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం, టీచింగ్ ఫ్యాకల్టీ హాజరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల హాజరు శాతం పెరగాలని, టీచింగ్ స్టాఫ్ సమయపాలన పాటించాలన్నారు. తరగతులను రెగ్యులర్‌గా తీసుకోవాలన్నారు. ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకొని నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అనతరం వర్సిటీలోని ఉమెన్స్ హాస్టళ్లను పరిశీలించారు. మౌళిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో నూతనంగా చేరుతున్న విద్యార్థులకు సరైన వసతులు కల్పించాలని ఆదేశించారు.

జిల్లాలో పనిచేయడం సంతృప్తినిచ్చింది



అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లాలో పనిచేయడం సంతృప్తినిచ్చిందని, తనకు విధినిర్వహణలో సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు జేసీ నారపురెడ్డి మౌర్య తెలిపారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనంతరం జేసీ మాట్లాడారు. తిరుపతి మునిసిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్తున్న ఆమె మంగళవారం విధుల నుంచి రిలీవ్ కానున్న నేపథ్యంలో అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. జిల్లాల విభజన తరువాత నంద్యాల జిల్లా జేసీగా బాధ్యతలు చేపట్టాన్నారు. తరువాత కర్నూలు జిల్లా జేసీగా మళ్లీ వచ్చానని, కర్నూలులో అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఉండడంతో పనిచేయడం సులువైందన్నారు. వెనుకబడిన కర్నూలు జిల్లాను ముందు వరుసలో నిలిపేందుకు తనవంతు కృషి చేశానన్నారు. ముఖ్యంగా ఆదోని సబ్ కలెక్టర్, పత్తికొండ, కర్నూలు ఆర్‌డీఓలు, తహసీల్దార్లు పూర్తి స్థాయిలో సహకరించడంతో రీసర్వే, భూపంపిణీ కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టినట్లు వివరించారు. ఎన్నికల్లో అందరూ సహకరించడంతో గొడవలు లేకుండా ప్రశాంతంగా నిర్వహించినట్లు చెప్పడానికి గర్వపడుతున్నట్లు చెప్పారు. డీఆర్వో కె.మధుసూదన్‌రావు ఉన్నారు.

రాష్ట్రంలో మహిళలు, చిన్నారులకు రక్షణ కరువు



సమావేశంలో మాట్లాడుతున్న గిడ్డమ్మ

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలో మహిళలు, చిన్నారులకు రక్షణ లేకుండా పోయిందని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో 9 ఏళ్ల చిన్నారిపై అత్యాచారం జరిపి హత్యచేస్తే కనీసం శవం కూడా కనిపించకుండా చేశారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. సోమవారం కర్నూలులోని సీఆర్ భవన్‌లో ఏపీ మహిళా సమాఖ్య కర్నూలు నగర మూడో మహాసభలు జరిగాయి. ముందుగా సమాఖ్య పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులకు రక్షణ కరువైందన్నారు. మహిళలపై దాడులు, దౌర్జన్యాలు చేస్తున్న సమయంలో పాలకులు నిర్భయ, దిశ వంటి చట్టాలను చేసి తరువాత అమలు చేయడం లేదన్నారు.

నూతన కమిటీఎన్నిక

ఏపీ మహిళా సమాఖ్య కర్నూలు నగర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణిరెడ్డి తెలిపారు. గౌరవాధ్యక్షురాలిగా ఆశాబేగం, అధ్యక్షురాలుగా సి.నాగేంద్రమ్మ, ఉపాధ్యక్షురాలుగా సుధాదేవి, సోఫియా, కార్యదర్శిగా వి.భారతి, సహాయ కార్యదర్శులుగా వెంకటేశ్వరమ్మ, విజయ, మల్లేశ్వరమ్మ, ఆదిలక్ష్మి, పావని, సువర్ణమ్మతోపాటు మరో 15 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు వారు వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ ఫీడర్ల మరమ్మతు పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏడీ నాగప్రసాద్ తెలిపారు. కర్నూలులోని సంతోష్‌నగర్, ఎస్‌ఆర్ పేట ఫీడర్లలో మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో సంతోష్‌నగర్, విజయలక్ష్మినగర్, గీతాముఖర్జీ నగర్, సంపత్‌నగర్, ఉమర్‌నగర్, బాలాజీనగర్, స్టాంటన్‌పురం, బైరెడ్డి రైస్‌మిల్ ఏరియా, ఎస్‌ఆర్‌పేట, సంకల్‌బాగ్, కొత్తపేట ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెద్దాసుపత్రిలో ఆటో అపహరణ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓ వ్యక్తి ఆటోను దొంగలు అపహరించారు. గూడూరు మండలం గుడిపాడు గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ మలిపోగు రాజు గత నెల 25వ తేదీన ఉదయం 9.10 గంటలకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆటోను పార్క్ చేసి చికిత్స కోసం ఓపీకి వెళ్లాడు. చికిత్స అనంతరం 10.30 గంటలకు తిరిగివచ్చి చూడగా ఆటో కనిపించలేదు. దీనిపై సోమవారం మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

పెరుగుతున్న న్యూరో సమస్యలు

కర్నూలు(హాస్పిటల్): ప్రపంచవ్యాప్తంగా న్యూరో సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయని న్యూరోఫిజీషియన్ డాక్టర్ నాగసురేష్, డాక్టర్ విశ్వకుమార్ చెప్పారు. ప్రపంచ మెదడు దినోత్సవం పురస్కరించుకుని సోమవారం స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెదడుకు సంబంధించిన ఏ వ్యాధి వచ్చినా తేలిగ్గా తీసుకోకూడదని, వెంటనే చికిత్స చేయించుకోవాలన్నారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ముఖ్యమని సూచించారు. కార్డియాలజిస్టు డాక్టర్ చైతన్య కుమార్, హాస్పిటల్ క్లస్టర్ హెడ్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సస్పెండ్ అయిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి

కర్నూలు కల్చరల్: ఎన్నికల విధుల్లో సస్పెండ్ అయిన ఉపాధ్యాయులకు పూర్తి జీతం చెల్లించాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గట్టు తిమ్మప్ప డిమాండ్ చేశారు. సోమవారం జూమ్ ద్వారా జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల విధులకు గైర్హాజరయిన 50 మంది ఉపాధ్యాయులకు మే 21 నుంచి జూన్ 12వ తేదీ వరకు జీతం చెల్లించాలన్నారు. డీఈఓ పూల్‌లో ఉన్న ఉపాధ్యాయులకు జీతాల చెల్లింపులకు శాశ్వత పరిస్కారం ఆలోచించాలన్నారు. నాయకులు వెంకట్రాముడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కరే కృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ రామలింగేశ్వర్

కర్నూలు (టౌన్): అర్జీదారుల సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతామని నగరపాలక అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక నగరపాలకలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ కాలనీల నుంచి వచ్చిన ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, ఆరోగ్య శాఖాదికారి విశ్వేశ్వర రెడ్డి, ఆర్ఓ జునీద్, డీసీపీ సంధ్యారాణి, డీపీఓ ఉమేష్ పాల్గొన్నారు.

ఫిర్యాదులు ఇవే..

- తన ఇంటి పక్కన ఉండే మహిళ ప్రతిరోజు అనవసరంగా రోడ్డుపై మున్సిపల్ వాటర్‌ను వృథా చేస్తోందని బి.క్యాంపునకు చెందిన నరాల చంద్రారెడ్డి ఫిర్యాదు చేశారు.
- తమ కాలనీలో డ్రైనేజీ కాలువలు, తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేయాలని తుంగభద్ర కాలనీకి చెందిన నరేంద్రనాథ్ వినతిపత్రం అందజేశారు.
- తమ కాలనీలో 26 కుటుంబాలు నివసిస్తున్నాయని, తామే వీధిలైట్లు ఏర్పాటు చేసుకొని విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నాం. వాటి నిర్వహణను నగరపాలక సంస్థ తీసుకోవాలని పెద్దపాడుకు చెందిన మైత్రీ హోమ్స్ కాలనీవాసులు తులసిరెడ్డి, రమేష్ విన్నవించారు.
- చెక్‌పోస్టు సమీపంలోని నాజర్‌కాలనీ, జయరాం నగర్, మురహరి నగర్‌లో డ్రైనేజీ కాల్వలు, రోడ్లు ఏర్పాటు చేయాలని రంగన్న, యేసయ్య, వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలి



మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

కర్నూలు(సెంట్రల్): ప్రజా క్షేత్రంలోఉండి సమస్యల పరిస్కారం కోసం కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం కేంద్ర కమిటీసభ్యుడు ఎంఏ గఫూరు ఆ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం కార్మిక, కర్షక భవన్‌లో సీపీఎం జిల్లా ప్లీనరీ సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామాంజనేయులు, అలివేలమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. 2024 పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తరువాత జరిగే తొలి జిల్లా స్థాయి సమావేశమిదని, జిల్లాలో పార్టీ సభ్యులుగా పనిచేస్తున్న నాయకులు అప్రమత్తంగా ఉండి ప్రజా సమస్యలను గుర్తించి ప్రభుత్వానికి నివేదించాలన్నారు. పరిష్కారానికి నోచుకోకపోతే ప్రజా ఉద్యమాలను రూపొందించాలన్నారు. ముఖ్యంగా ప్రజలకు తాగునీరు, సొంతిల్లు, ఉద్యోగ అవకాశాల కోసం పోరాటాలు చేయాలన్నారు. కర్నూలును పారిశ్రామిక హబ్‌గా మార్చి యువతకు ఉద్యోగాలు వచ్చేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్న విషయాన్ని తెలియజేయాలన్నారు. సాగునీటి ప్రాజెక్టులను నిర్మించి అన్నదాతలకు ఇబ్బంది కలగకుండా చూసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, రామకృష్ణ, నారాయణ, ఎండీ ఆనంద్‌బాబు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

రజకులకు రక్షణ చట్టం చేయాలి

కర్నూలు(సెంట్రల్): రజకులపై జరుగుతున్న దాడుల నివారణ కోసం రక్షణ చట్టాన్ని చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం రజక వృత్తిదారుల కార్యాలయంలో మాట్లాడుతూ.. నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో రజకులపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. పట్టణాల్లో అపార్టుమెంట్ వాచ్‌మెన్‌లు, ఇస్త్రీదారులపై దాడులు జరుగుతున్నా నివారణకోసం ప్రభుత్వాలు చట్టాలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల నంద్యాల జిల్లాలో లింగస్వామి, శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన సూర్యనారాయణ అనే రజకులను హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలన్నారు. ఆళ్లగడ్డలో రజకుడైన శీనుపై దాడి చేసిన వారిని పోలీసులు అరెస్టు చేయాలని కోరారు.

కామ్రేడ్ చంద్రశేఖర్ ఆశయ సాధనకు కృషి



రాయల్ చంద్రశేఖర్ పోస్టర్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

కర్నూలు(సెంట్రల్): సీపీఐ ఎంఎల్‌మాస్‌లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ రాయల చంద్రశేఖర్ ఆయశ సాధనకు కృషిచేస్తామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు అర్లప్ప పిలుపునిచ్చారు. సోమవారం రవన్న కార్యాలయంలో రాయల్ చంద్రశేఖర్ సంతాప సభను నిర్వహించారు. ముందుగా ఇటీవల ఖమ్మంలో రైలు ప్రమాదంలో చనిపోయిన రాయల్ చంద్రశేఖర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాయల్ చంద్రశేఖర్ 50 సంవత్సరాలుగా పీడిత ప్రజలు, రైతుల పక్షాన పోరాటాలు చేశారని చెప్పారు. నిరుపేదలకు భూమి, ఇళ్ల స్థలాల కోసం ఎన్నో పోరాటాలు చేశారని, ఆయన దురదృష్టవశాత్తు రైలు ప్రమాదంలో మృతిచెందడం తీవ్ర వేదనకు గురిచేసిందని చెప్పారు. నాయకులు తిరుపాలు, రాజేష్, రమేష్, రాజేష్, స్వాములు, విశ్వనాథ్ పాల్గొన్నారు.

రోడ్‌సైడ్ వ్యాపారులపై ట్రాఫిక్ పోలీసుల కొరడా

- వ్యాపార సామగ్రి స్టేషన్‌కు తరలింపు
- సుమారు 200 మందిపై పిటీ కేసులు



ఆటోడ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కర్నూలు: కర్నూలు నగరంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగిస్తున్న వారిపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. కోడుమూరు రోడ్డులోని రేడియోస్టేషన్ నుంచి బళ్లారి చౌరస్తా, కొత్తబస్టాండ్ మీదుగా పాతబస్టాండ్ వరకు, ఎస్‌బీఐ సర్కిల్ నుంచి మున్సిపల్ కార్యాలయం మీదుగా సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ కళాశాల వరకు, రాజ్ విహార్ నుంచి నంద్యాల చెక్‌పోస్టు వరకు రోడ్లకు ఇరువైపులా తోపుడు బండ్లు, మొబైల్ క్యాంటీన్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగిస్తుండడం వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాహనదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం ట్రాఫిక్ సీఐ గౌతమి ఆధ్వర్యంలో సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి సెయింట్ జోసెఫ్ కళాశాల వరకు, కొత్తబస్టాండ్ నుంచి కోడుమూరు రోడ్డులోని ఉల్చాల జంక్షన్ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దుకాణాల ముందు ఉన్న ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని వ్యాపారాలు సాగిస్తున్న వారిని హెచ్చరించారు. అలాగే రోడ్డుపై తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకుని పూలు, పండ్లు, కూరగాయలు, పచ్చి టెంకాయలు, బజ్జీల దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగిస్తున్న వారిని అక్కడినుంచి తొలగింపజేశారు. వారు వినియోగిస్తున్న సామగ్రిని పోలీసు రికవరీ వ్యాన్‌లో కొత్తపేటలోని ట్రాఫిక్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేస్తే ఇకపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సుమారు 200 మందిపై పిటీ కేసులు నమోదు చేసి వారిని కోర్టులో హాజరుపర్చనున్నట్లు సీఐ గౌతమి తెలిపారు.

ఆటోవాలాలకు హెచ్చరిక

పార్కింగ్ లేని ప్రాంతాల్లో ఆటోలు నిలిపి బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్న ఆటోవాలాలకు ట్రాఫిక్ పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. కొత్తబస్టాండ్, బళ్లారి చౌరస్తా, మున్సిపల్ కార్యాలయం వద్ద రోడ్డుపైనే పదుల సంఖ్యలో ఆటోలు నిలిపి ప్రయాణికుల కోసం వేచి ఉన్న పలువురు డ్రైవర్లను ఆయా ప్రాంతాల్లో సమావేశపర్చి తీవ్రంగా హెచ్చరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కొత్త చట్టాల ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు.

మరో ఐదు నామినేషన్ల దాఖలు



అదనపు కమిషనర్‌కు నామినేషన్ సమర్పిస్తున్న 23వ వార్డు కార్పొరేటర్ కటారి పల్లవి

కర్నూలు (టౌన్): నగర పాలక స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి సోమవారం మరో ఐదుగురు కార్పొరేటర్లు తమ నామినేషన్లు దాఖలు చేశారు. నగర పాలకలోని అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్‌కు వైఎస్సార్‌సీపీ, టీడీపీ కార్పొరేటర్లు తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఐదవ రోజు నామినేషన్లు దాఖలు చేసిన వారిలో 7వ వార్డు కార్పొరేటర్ పి.జుబేర్, 10వ వార్డు కార్పొరేటర్ షేక్ యూనస్ బాషా, 23వ వార్డు కార్పొరేటర్ కటారి పల్లవి, 24వ వార్డు కార్పొరేటర్ జక్కుల రమణమ్మ, 43వ వార్డు కార్పొరేటర్ కె.మునెమ్మ ఉన్నారు. ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేసేందుకు గడువు ఉందని అడిషనల్ కమిషనర్ స్పష్టం చేశారు. మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.